ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (మంగళ)
సహరి : 4:47 (బుధ)

ఏలేది ఎవరు?

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి తెలుగు దేశం పక్షాన అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా సస్పెన్స్ కొన సాగుతోం ది. ఇన్నాళ్లలో ఏలూరు స్థానం ప్రతిష్ఠంభనలో పడడం దాదాపు ఇదే ప్రథమం. ఈ స్థానం నుంచి బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు టీడీపీ యోచి స్తుండడంతో దానికి తగ్గట్టుగానే ఆశా వాహుల సంఖ్య పెరిగింది. మూడు పార్టీల పొత్తులో ఈ స్థానానికి అవకాశం లేక పోయినా చివరి క్షణంలో మార్పులు, చేర్పులు జరుగుతాయని జరిగిన ప్రచారం మరికాస్త గజిబిజికి దారితీసింది. ఏలూరు నుంచి తెలుగుదేశం పోటీ చేస్తుందని స్పష్టమైన సంకేతాలు ఉన్న బీజేపీ మాత్రం చివరి నిమిషంలో మార్పు కోసం ప్రయత్నిస్తోంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఏలూరు లోక్‌సభ స్థానం అభ్యర్థుల ఎంపికలో సీరియస్ కసరత్తు
- ఆర్థిక, సామాజిక అంశాలే ప్రధానం.. బీసీ వైపు టీడీపీ మొగ్గు
- గోరుముచ్చుతో సహా పుట్టా మహేష్, సత్యనారాయణ గౌడ్ పేర్ల పరిశీలన
- ఇంకోవైపు బీజేపీ తుది ప్రయత్నాలు



టీడీపీ పక్షాన ఏం జరుగుతోంది.. ?

ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి గెలుపు గుర్రాన్ని రంగంలోకి దింపేందుకు తెలుగుదేశం సుదీర్ఘ కసరత్తు చేసింది. చాన్నాళ్ల క్రితమే ఆశావాహుడిగా ముందుకొచ్చిన గోరుముచ్చు గోపాల్ యాదవ్ మాత్రం తనకే టిక్కెట్ ఖరారు అయిందని నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారానికి దిగారు. లోకేశ్ యువగళం యాత్రలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన గోపాల్‌కు టీడీపీ నుంచే చాన్స్ ఎక్కువని కేడర్ భావించింది. చాలాకాలం తర్వాత ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి బీసీ తరగతులకు చెందిన అభ్యర్థి రంగంలోకి దిగనుండడంతో పార్టీ సీనియర్లు తమ ఆమోదాన్ని వ్యక్తం చేశారు. గోపాల్ యాదవ్ పార్టీ సీనియర్లతో, కేడర్‌ను కలుపుకుపోయేందుకు ప్రయత్నించారు. చింతలపూడి, పోలవరం వంటి రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ ఆయన రాజకీయ పరిణితిని ప్రదర్శించారు. చింతలపూడి నియోజకవర్గానికి స్థానికుడైన తాను అందరికి అందుబాటులో ఉంటానని మెరుగైన అభివృద్ధి సాధిస్తానని చెబుతూ వచ్చారు. ఈలోపే ఆయన పేరుతో పాటు మరికొన్ని పేర్లు విన్పించాయి. ఇలాంటి వారిలో కంభంపాటి రామ్మోహన్ ఒకరు. గత ఎన్నికల్లోనూ కంభంపాటి ఏలూరు నుంచి పోటీకి దిగేందుకు ప్రయత్నం చేశారు. కాని అప్పట్లో కంభంపాటి పేరును చివరి వరకు పరిశీలించిన ఆయనకు బదులుగా టీడీపీ సీనియర్ నేత, పలుమార్లు ఎంపీకి పోటీ చేసిన మాగంటి బాబును బరిలోకి దించారు. ఓటమి అనంతరం మాగంటి కుటుంబానికి అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. దీంతో ఆయన కోలుకోలేనంతగా దెబ్బతిన్నారు. తిరిగి ఆయన ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు తొలుత ఆసక్తి ప్రదర్శించారు. ఎంపీగా పోటీ చేసేందుకు చివరి అవకాశం ఇవ్వాలని ఆయన సన్నిహితులు, బంధువులు గట్టిగా డిమాండ్ చేశారు. తెలుగుదేశం అధిష్ఠానం సుదీర్ఘ కాలంగా ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఒకే సామాజికవర్గం నుంచే అభ్యర్థులను దింపు తున్నందున ఈసారి దానికి భిన్నంగా ముందుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేసింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో సామాజికవర్గాల వారిగా పరిశీలిస్తే విభిన్న సామాజిక వర్గాల బలాబలాలు కాస్త అటూఇటూగా ఉన్నాయి. అయినప్పటికి తెలుగుదేశం సాధ్యమైనంతమేర అధికార వైసీపీని దెబ్బకొట్టి ఆ మేరకు గెలుపొందేలా మొదటినుంచి ఎత్తుగడలు వేస్తూనే ఉంది. ప్రత్యేకించి గోదావరి, కృష్ణా జిల్లాల రాజకీయకాక ఈ లోక్‌సభ స్థానంపై పడుతుండడంతో ఆ మేరకు కట్టుదిట్టంగా ఇటు ఎంపీ స్థానానికి అటు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను రంగంలోకి దింపాలని పదేపదే సర్వేలకు దిగింది. అంతకు మించి జనసేన బీజేపీతో పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటుకు దిగింది. ఉంగుటూరులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పోటీకి సిద్ధంగా ఉన్నా ఉంగుటూరు సీటును జనసేనకే కేటాయించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీటును త్యాగం చేశారనే సంకేతాన్ని తెలుగుదేశం ఇతర ప్రాంతాలకు పంపింది. నూజివీడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ తరగతికి చెందిన యాదవ సామాజికవర్గానికి చెందిన కొలుసు పార్థసారథిని రంగంలోకి దించింది. ఒకవైపు కైకలూరు స్థానాన్ని మిత్రపక్షమైన బీజేపీకి వదిలేశారు. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో 4 స్థానాల్లో టీడీపీ, 3 మిత్ర పక్షాలు పోటీ చేస్తున్న నేపథ్యంలో ఎంపీ స్థానానికి అభ్యర్థి ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

మహేష్ యాదవ్ లేదా సత్యనారాయణ గౌడ్ ?

లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రాజకీయాలను, సామాజిక వర్గాలను వడపోసి బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపాలన్న తుది నిర్ణయానికి టీడీపీ వచ్చింది. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణ అల్లుడు పుట్టా మహేశ్ యాదవ్ పేరును కొందరు తాజాగా ప్రతిపాదించారు. ఇప్పటికే ఏలూరులో గోపాల్ యాదవ్ పేరు నలుగుతుండగానే మహేష్ యాదవ్ పేరు పరిశీలనకు రావడం టీడీపీ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. యాదవ సామాజిక వర్గానికి చెందిన తాను రంగంలో ఉంటే ఇతర సామాజిక వర్గాల నుంచి గట్టి మద్దతు ఉంటుందని ఈ కారణంగా తనకే సీటు కేటాయించాల్సిందిగా మహేష్ యాదవ్ పట్టుబడుతున్నట్టు సమాచారం. యనమల రామకృష్ణుడి కుటుంబీకుల్లో ఇప్పటికే ఒకరికి అసెంబ్లీ స్థానం కేటాయించినందున ఇంకొకరికి సీటు కోసం ప్రయత్నించడమేంటనే ప్రశ్న తలెత్తింది. కుటుంబ నేపథ్యం, ఆర్థిక నేపథ్యం ఇంకో వైపు పార్టీ బలం మహేష్ యాదవ్‌కు కలిసివచ్చే అంశాలని ఇంకొందరు వాదిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి సైతం యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. ఇదిలా ఉండగా పోలీస్ అధికారి సత్యనారాయణ గౌడ్ పేరు కొత్తగా తెర ముందుకొచ్చింది. ఆయన పేరును సైతం తెలుగుదేశం పరిశీలనలోకి తీసుకుంది. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో బీసీ వర్గంలో తన సామాజిక బలం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారనేది ఆయన వాదనగా ఉంది. ఎలాగో యాదవ సామాజికవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి ఉండగా గౌడ సామాజిక వర్గం నుంచి ఆయనకు అవకాశం ఇవ్వాలని ఇంకొందరి వాదనగా ఉంది.

బీజేపీది ఇంకోరూటు

ఏలూరు లోక్‌సభ స్థానంపై బీజేపీ కూడా దృష్టి పెట్టింది. మూడు పార్టీల ఒప్పంద అంగీకారంలో జాబితాలో ఏలూరు లేనప్పటికి సంఖ్యాపరంగా కొంత సరిచేసుకుంటే చాలనేది బీజేపీ అనుకూలుర వాదన. ఉమ్మడి పశ్చిమలో నరసాపురం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. మొత్తం పది పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ పోటీ చేయాల్సి ఉండగా అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. ఈలోపే పొత్తు సంఖ్యాబలం దృష్ట్యా ఎక్కడైన స్థానాన్ని వదులుకొని ఏలూరు స్థానం తమకు కేటాయించేలా చూడాలని బీజేపీ పట్టుబడుతోంది. ఈ స్థానాన్ని ఆశించిన బీజేపీ నేత తపన చౌదరి ఇప్పటికే ఆత్మీయ సదస్సు నిర్వహించారు. బీజేపీ అధినాయకత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు. తన పంతమే నెగ్గుతుందన్న భావనలో తపన ఉన్నారు.

22 మంది సెక్టార్ అధికారుల నియామకం

ఏలూరుసిటీ, మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గానికి 22 మంది సెక్టార్ అధికారులను నియమించారు.

సెక్టార్ అధికారి	మొబైల్ నెం
ఎస్‌కె రఫీ, ఏఈ, మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు	8978999933
కేవై కిషోర్, ఐసీడీఎస్, ఏలూరు	8142396969
పి.కొండలరావు, డిప్యూటీ ఈఈ, మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు	9849907150
డి.లీలా మోహనరావు, డిప్యూటీ ఈఈ , పీఆర్‌ఐ , ఏలూరుసబ్‌డివిజన్(జడ్పీ)	9440726181
ఎ.సుమధుర వాణి, ఏడీ , డీఐసీ, ఏలూరు	9949696897
ఎం. తిరుపతిరావు, ఏసీపీ, మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు	9492619946
వి.మహేంద్రనాథ్, ఏడీ, మార్కెటింగ్, ఏలూరు	9182361265
జి.రాధాకృష్ణ, ఏఎల్ఎస్, కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష, ఏలూరు	9848229622
వి.తాతబ్బాయ్, డీఈ, మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు	9849907149
బండి శ్రీదేవి, ఏడీ, సీపీవో కార్యాలయం, ఏలూరు	7386818088
ఎస్.రఘునంద, ఏడీ, హ్యాండ్‌లూమ్ కార్యాలయం, ఏలూరు	8008705703
పి.శివాజీ, స్టాటిస్టికల్ అధికారి, సీపీవో ఆఫీస్, ఏలూరు	9493309230
వైఎస్ భూపాల్, ఐపీవో, డీఐసీ, ఏలూరు	7386309455
కె.ఫణిభూషణమ్, డీఈఈ, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ , ఏలూరు	9182869805
పి.లలితాసుధ, డీడీ (ఎఫ్‌టీసీ), సర్ ఆర్థర్ కాటన్ భవన్	8331056662
వై.సుబ్బారావు, ఏడీఏ (రెగ్యులర్), సర్ ఆర్థర్ కాటన్ భవన్	8331056641
ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్	9848316338
ఎస్‌కే గౌస్ బాషా, అగ్రికల్చరల్ అధికారి, ఏలూరు	7093067681
బి.రాజ్‌కుమార్, ఏడీ, ఫిషరీస్, ఏలూరు	9849413671
కె.శ్రీదేవి, డీఆర్‌సీ డీటీసీ, ఏలూరు	9493303302
ఎం.సరళాకుమారి, ఈవో (పీఆర్‌అండ్ ఆర్డీ), ఏలూరు	9912826999
డి.కృష్ణ మోహన్, అసిస్టెంట్ ఇంజనీర్, పీఆర్, ఏలూరు	6304548122

23,171 పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోల తొలగింపు

ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు

ఏలూరు సిటీ, మార్చి 18 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రకటనలకు సంబంధించి జిల్లాలో 23 వేల 171 పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు తదితరాలు తొలగించినట్టు జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు సోమవారం తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ పథకాలకు సంబంధించి పబ్లిక్ ఆస్తుల వద్ద సంబంధిత ఫొటోలతో కూడిన 883 వాల్ రైటింగ్స్, 5,717 పోస్టర్లు, 5,634 బ్యానర్లు, 2,140 హోర్డింగ్స్, జెండాలు వంటివి మొత్తం 14వేల 374 తొలగించారని, దేశ, రాష్ట్ర నాయకులకు చెందిన 2,697 విగ్రహాలకు ముసుగులు వేశారని, ప్రైవేట్ ప్రదేశాల్లో ఉన్న 558 వాల్ రైటింగ్స్, 3,778 పోస్టర్లు, 2,981 బ్యానర్లు, 1,480 హోర్డింగ్స్, జెండాలు వంటివి మొత్తం 8వేల 797 తొలగించారన్నారు. దేశ , రాష్ట్ర నాయకులకు చెందిన 4,052 విగ్రహాలకు ముసుగులు వేసినట్టు వివరించారు.



ఇంకా బొమ్మ తీయలేదు!

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 48 గంటలు గడిచినా జిల్లాలో నిబంధనల అమలులో అధికారులు నిర్లక్ష్యంగానే కనిపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రాజకీయ సంబంధ ఫ్లెక్సీలు తొలగించినా, కొన్నిచోట్ల ఫ్లెక్సీలు తొలగించ లేదు. మరికొన్ని చోట్ల అధికార వైసీపీకి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాల తొలగింపులో వివక్ష చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పక్క చిత్రంలోని ఏలూరు రైల్వే స్టేషన్ నుంచి నిమ్మకాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో తొలగించని సీఎం జగన్ ఫ్లెక్సీలే దీనికి నిదర్శనం. 7

'పది' పరీక్షలు ప్రశాంతం

- 'ఓపెన్' ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18 : కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెగ్యులర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగియగా, ఆరోపణలు వెల్లువెత్తే 'ఓపెన్' ఇంటర్ పరీక్షల్లో ఓ మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. తొలిరోజున జరిగిన రెగ్యులర్ విద్యార్థులకు నిర్వహించిన ప్రథమ భాష పేపర్-1 పరీక్షకు జిల్లాలో మొత్తం 25,939 మంది బాల బాలికలు దరఖాస్తు చేసుకోగా 24,181 మంది హాజరయ్యారు. మరో 1,758 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని డీఈవో అబ్రహం వివరించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ప్రభుత్వ పరిశీలకుడు నరసింహారావు, ఇతర అధికారులు, స్క్వాడ్ బృందాలు మొత్తం 48 పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేశాయి. పరీక్షా కేంద్రాలకు ఉదయం 7.30 గంటల నుంచే విద్యార్థులు చేరుకోవడం ప్రారంభమైంది.

'ఓపెన్' దూరవిద్య పరీక్షలకు మరిన్ని స్క్వాడ్ బృందాలు

ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే చర్యల్లో భాగంగా ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను అదనంగా సోమవారం ఆకస్మికంగా నియమించడం గమనార్హం. రెగ్యులర్ పరీక్షల కోసం నియమించిన స్క్వాడ్ బృందాలన్నింటినీ ఓపెన్ స్కూల్స్ పరీక్షలకు కూడా వినియోగించుకోవాలని పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం జరిగిన దూరవిద్య తెలుగు సబ్జెక్టు పదో తరగతి పరీక్షకు జిల్లాలో 842 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 735 మంది, ఉర్దూ పరీక్షకు ఏడుగురు హాజరయ్యారని డీఈవో వివరించారు. ఇంటర్ తెలుగు పరీక్షకు 1,154 మందికి 1,064 మంది, హిందీ పరీక్షకు 19 మందికి 17 మంది హాజరయ్యారు. నూజివీడులోని విజ్డం హైస్కూలు పరీక్ష కేంద్రంలో హిందీ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థిని జవాబులు రాసివున్న ఫొటోస్టాట్ కాపీలతో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండడాన్ని గమనించిన స్క్వాడ్ బృందం పట్టుకుని కేసు నమోదు చేసిందని డీఈవో తెలిపారు. సహాయకుల (స్క్రైబ్) సాయంతో పరీక్షలు రాసే దివ్యాంగుల కోసం నియమించే విద్యార్థులు 9వ తరగతికి చెందినవారు మాత్రమే ఉండాలని, కేవలం పరీక్షార్థి చెప్పే జవాబులు రాయడమే వీరిపనిగా ఉండాలని , దీనికి విరుద్ధంగా ఎవరినైనా నియమిస్తే పరీక్ష కేంద్రం నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ హెచ్చరించారు.



ఆర్‌ఆర్ పేట పరీక్ష కేంద్రం వద్ద పది విద్యార్థులు



ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆకస్మిక తనిఖీలు



పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

ఏలూరు క్రైం : పది పరీక్షా కేంద్రాలను ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఏలూరులోని భాష్యం స్కూలు, కేపీడీటీ హైస్కూల్, అమలోద్భవి హైస్కూళ్లను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు చేస్తున్నామని, మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఇంటర్ బ్రిడ్జి కోర్సు పరీక్షలకు 366 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షల్లో చివరి దైన ద్వితీయ సంవత్సరం బ్రిడ్జి కోర్సు పరీక్షలు జిల్లాలోని 12 కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 109 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు ఒక్కరూ హాజరుకాలేదని, ఒకేషనల్ విభాగం లో 1,152 మందికి 895 మంది హాజరయ్యారన్నారు. మొత్తంగా 366 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

వాతావరణంలో మార్పులు.. రైతుల ఆందోళన



మట్టగుంటలో హడావుడిగా చేపల పట్టుబడి

కలిదిండి/ ముదినేపల్లి రూరల్/భీమవరం రూరల్, మార్చి 18 : వాతావరణంలో మార్పులు అటు ఆక్వా రైతులతో పాటు ఇటు దాళ్వా రైతులను కంగారు పెట్టిస్తోంది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడం, మరోపక్క వాతావరణ శాఖ అధికారులు వర్షం పడుతుందని సూచించడంతో ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కలి దిండి మండలంలో 23 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. వేసవిలో రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో లక్షలాది రూపాయల పెట్టుబడులతో వనామి రొయ్యల పెంపకం చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండడంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉండడంతో చెరువుల్లో రేయింబవళ్లు ఏరియేటర్లుతిప్పుతూ ఆక్సిజన్ టాబ్లెట్లు వేస్తూ ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా చూస్తున్నారు. చేపల చెరువుల్లో సైతం ఆక్సిజన్ లోపించే అవకాశం ఉండడంతో చెరువుల్లో ఉదయాన్నే బోటు తిప్పుతుండడంతో కెరటాలు వచ్చి ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. హడావిడిగా చేపలను పట్టుబడి చేసి గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ అయినకాడికి అమ్ముకుంటున్నారు. ముదినేపల్లి మండంలో మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మినప తీతలు పూర్తికాగా నూర్పిళ్లు సాగిస్తున్నారు. ఈ దశలో వర్షం వస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది ఇదే సమయంలో వర్షాలు కురిసి మినుము పంట పాడైంది. ఈ నేపథ్యంలో రైతులు ఎవరికి వారు హడావిడిగా కూలీలకు అధికరేటు వెచ్చించి నూర్పిళ్లు సాగిస్తున్నారు. దాళ్వా రైతులు సైతం వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షల ఎకరాలలో దాళ్వా సాగు చేశారు. మెట్టలో ఈనిక పూర్తయి పాలు పోసుకునే దశలోను, డెల్టాలో ఈనిక దశ, పొట్ట దశ, మరికొన్ని ప్రాంతాలలో అయితే పిలక తొడిగే దశలో వరి పంట ఉంది. ఈ దశలో చిన్నపాటి వర్షం పడినా మేఘాలతో వాతావరణం ఉన్నా ముడత, అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు ప్రధానంగా విజృంభించే అవకాశం ఉంది. ఇవి వస్తే పురుగు మందుల పెట్టుబడి భారం, దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

ప్రజా ప్రతినిధి అండతో.. కార్పొరేషన్ స్థలం ఆక్రమణ



హెచ్చరిక బోర్డు ఉన్న ఆగని నిర్మాణం

ఏలూరు రూరల్, మార్చి 18 : తంగెళ్ళమూడి కంద్రికగూడెంలో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతో ఓ వ్యక్తి మునిసిపల్ కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి షాపు ఏర్పాటుకు పూనుకున్నాడు. ఇది కార్పొరేషన్‌కు చెందిన స్థలమని హెచ్చరిక బోర్డు ఉన్నా దానిని లెక్కచేయకుండా నిర్మాణం సాగిస్తుండడంతో స్థానికులు అడ్డుకు నేందుకు ప్రయత్నించగా ఆ వ్యక్తి వారిపై గొడవకు దిగాడు. కంద్రికగూడెం సెంటర్ సచివాలయం పక్కనే కిళ్ళీషాపును ఓ వ్యక్తి నడుపుకుంటున్నాడు. దాని పక్కనే కార్పొరేషన్‌కు చెందిన స్థలం ఉంది. ప్రస్తుతం ఉన్న షాపునకు జతగా మరో దుకాణం ఏర్పాటు చేసేందుకు ఐరన్ రాడ్‌లు, షెడ్డు రేకులతో రెండురోజులుగా పనులు మొదలు పెట్టాడు. కార్పొరేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం తగదని స్థానికులు వారించినా తనకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అభయం ఇచ్చాడని, షాపు ఏర్పాటు చేసుకోమన్నారని చెబుతూ వారిపైనే తిరగబడడం విశేషం. సోమవారం ఉదయం స్థానికులు కొందరు కార్పొరేషన్ అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. వారు అక్కడకు చేరుకుని మునిసిపాలిటీ స్థలంలో అక్రమ నిర్మాణం తగదని వారించినా తనకు ప్రజాప్రతినిధి అండ ఉందని చెబుతూ అడ్డువచ్చిన వారిపై దుర్భాషలకు దిగాడని స్థానికులు పేర్కొన్నారు. ఎట్టకేలకు స్పందించిన కార్పొరేషన్ అధికారులు అక్కడకు వచ్చారు. అయితే ఆ ప్రజాప్రతినిధి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో అధికారులు షెడ్డురేకులు మాత్రమే తొలగించి మిగతా వాటిని అలాగే వదిలివేయడం కొసమెరుపు.

బటన్ నొక్కినా.. సొమ్ములు పడలే!

అందని జగనన్న విద్యాదీవెన నిధులు

- ఫీజులు చెల్లించలేదని ధ్రువపత్రాలు ఇవ్వని పలు విద్యాసంస్థలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



ఏలూరు రూరల్, మార్చి 18 : పేద విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ టీడీపీ ప్రభుత్వ హయాంలో దిగ్విజయంగా అమలు చేశారు. ఎంతో మంది పేద విద్యార్థుల కలలు సాకారమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న విద్యాదీవెన పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని ద్రాక్షగానే మారింది. ఇంటర్ నుంచి పీజీ, వృత్తివిద్యల వరకు పేద విద్యార్థులు ఏ ప్రైవేట్ విద్యాసంస్థలోనైనా చదవగలిగే విధంగా ఫీజులను రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆయా విద్యాసంస్థలకు నేరుగా చెల్లించే విధానాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారు. ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తివిద్యలతో పాటు వివిధరకాల ఉన్నత విద్యను చదవగలిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉద్దేశాన్ని అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. తాజాగా గత విద్యాసంవత్సరాన్ని పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కొంతమందికే ఇచ్చి మరికొంతమందికి ఇవ్వకపోవడం వల్ల ఇటు విద్యార్థులతో పాటు అటు విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు ఫీజులు చెల్లించలేదని విద్యార్థులకు ధ్రువ పత్రాలు ఇవ్వకుండా పలు విద్యాసంస్థలు ఇబ్బందులు పెడుతున్నాయి. ఆయా కళాశాలల నుంచి ఉన్నత విద్యకు వెళ్లాల్సిన విద్యార్థులకు ప్రొవిజనల్స్ ఇవ్వడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేయకపోవడం వల్ల ఆ విద్యార్థి తల్లిదండ్రులు అప్పులు పాలవుతున్నారు. ఈనెల మార్చి 1వ తేదీన విద్యాదీవెన పథకం కింద అక్టోబరు- నవంబరు 2023 త్రైమాసికానికి సంబంధించి 32,452 మంది విద్యార్థులకు సంబంధించి విద్యార్థుల తల్లుల జాయింట్ ఖాతాలకు జిల్లాలో 26.42 కోట్లు నిధులు జమ చేస్తున్నామంటూ బటన్ నొక్కారు. అయితే ఇప్పటికి 60 శాతం మందికి మాత్రమే చెల్లింపులు జరిగాయి. జిల్లాలో 8,052 ఎస్సీ విద్యార్థులకు రూ.6.15 కోట్లు, ఎస్టీ విద్యార్థులు 1,478 మందికి రూ.79 లక్షలు, బీసీ విద్యార్థులు 14,835 మందికి రూ.12.13 కోట్లు, ఈబీసీ విద్యార్థులు 2,738 మందికి రూ.2.79 కోట్లు, ముస్లిం మైనార్టీ విద్యార్థులు 852 మందికి రూ.74 లక్షలు, కాపు విద్యార్థులు 4,137 మందికి రూ.3.35 కోట్లు, క్రిష్టియన్ మైనార్టీ విద్యార్థులకు 370 మందికి రూ.29 లక్షలు మొత్తం 32,452 మంది విద్యార్థులకు 29,281 తల్లుల ఖాతాలకు సొమ్ము ప్రభుత్వం జమ చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఇందులో కేవలం సగంమందికే నగదు జమ అయింది. ఈ కారణంగా విద్యార్థులు మానసిక ఆందోళన చెందుతున్నారు. ఈ పథకాన్ని నీరుగార్చి పేద విద్యార్థులకు అన్యాయం చేయవద్దని, గత ప్రభుత్వం మాదిరిగా ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాలని పేద విద్యార్థులు కోరుతున్నారు. మధ్యంతరంగా వదిలివేస్తే భారీ ఫీజులతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుకోలేక ఉన్నత విద్యకు తాము దూరమవుతామని వారు వాపోతున్నారు.

తెల్లబోయారు..!

పత్తి రైతుకు నష్టాలే!

- ఒకవైపు తగ్గిన దిగుబడులు.. మరోవైపు ధర లేని వైనం
- అయినకాడికి అమ్ముకున్న రైతులు
- ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు నష్టం
- చెయ్యి దాటిన తర్వాత పెరిగిన ధర
- ప్రస్తుతం క్వింటా పత్తి రూ.6 వేల నుంచి రు.7వేలు



కుక్కునూరు, మార్చి 18 : వ్యాపారుల చేతిలో రైతు దగా పడుతున్నాడు. ఈ ఏడాది వర్షా భావంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. మరోవైపు ధర ఆశాజనకంగా లేకపోవడంతో రైతాంగం నష్టపోయారు. రైతు దగ్గర పత్తి ఉన్నప్పుడు క్వింటా రూ.5 వేలు నుంచి రూ.6 వేలు పలికింది. చెయ్యి దాటిన తర్వాత ప్రస్తుతం రూ.6 వేలు నుంచి రూ.7 వేలు పలుకుతోంది. ఆరు గాలం శ్రమించి పంట పండించిన రైతు కంటే వ్యాపారి లాభాలను ఆర్జిస్తున్నాడు. రైతాంగం మాత్రం అప్పుల ఊబిలో కురుకుపోతున్నారు. ఈ ఏడాది ఆరంభంలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో పత్తి సాగు ఆలస్యంగా మొదలైంది. అనంతరం జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు కురవడంతో పూత పిందెతో పత్తి పంట ఆశాజనకంగా మారింది. మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. ఈ క్రమంలో వర్షాలు మొహం చాటేశాయి. అక్టోబరులో వర్షాభావ పరిస్థితులు ఏర్ప డ్డాయి. పత్తి మొక్కకు పూసిన, పిందె ఎండకు వడలి నేల రాలింది. ఎకరానికి కనీసం ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వస్తుందని రైతాంగం ఆశించినా ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. ఇదే సమయంలో క్వింటా పత్తి ధర రూ.6 వేలు మించి పలకలేదు. ఎకరానికి రూ.40 నుంచి రూ.50 వేలు రైతులు పెట్టుబడులు పెట్టగా కనీసం రూ.20 వేలు కూడా రైతు చేతికి రాలేదు. దీంతో ఎకరానికి 20 నుంచి 30 వేలు రైతులు నష్టపోయారు. నవంబరులో వచ్చిన తుఫాన్‌కు ఎండిన పత్తి పంటలు చిగురించాయి. కొంతవరకు పూత,పిందె వచ్చింది. అరకొరగా వస్తున్న పత్తికి ఇప్పుడు ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు.



ద్వారకాతిరుమల గుడిసెంటర్‌లో కుక్కలను పట్టి వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యం

ద్వారకా తిరుమలలో వీధి కుక్కల పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, మార్చి 18: 'ద్వారకా తిరుమలలో వీధికుక్కల భయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ఆలయ అధికారులు స్పందించారు. క్షేత్ర పరిసరాలలో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టించి మూడు వ్యాన్‌లలో అటవీ ప్రాంతాలకు తరలించారు. రెండు రోజుల క్రితం అన్నదాన భవనం వద్ద ఓ భక్తు నిపై శునకం దాడి చేయడంతో అతని చేతివేలు సగం తెగిపడిన విషయం తెలిసిందే కొన్నాళ్లుగా ఈ శునకాలు డెర్మటైటిస్ అనే చర్మవ్యాధి బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. వీటి రోగాన్ని నిర్మూలించేందుకు ఎవరూ చర్యలు చేపట్టక పోవడంతో అది అంటువ్యాధిగా ప్రబలి ఆరోగ్యవంతమైన కుక్కలకు అంటుతున్నాయి.ఎట్టకేలకు అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఏడుగురిని ఏం చేస్తారో ?

ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణకు 'కోడ్' అడ్డంకి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18 : కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ జీవోలకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలుస్తోందేమోనన్న భయాందోళనలు సంబంధిత ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవేళ రెగ్యులరైజేషన్ జీవోలను జారీ చేయడానికి ఎన్నికల కమిషన్ నుంచి ప్రత్యేక అనుమతులను తెచ్చు కోవాల్సి వస్తే రాష్ట్రప్రభుత్వం తాత్సారం చేస్తుండటం ఉద్యోగుల ఉత్కంఠకు కారణమవు తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్ఏ (మేల్, ఫిమేల్), ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు కేడర్లలో మొత్తం 268 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణకు అర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఈ ప్రతిపాదనలను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో పరిశీలించి విడతలవారీగా ఆయా కేడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు జీవోలు జారీచేశారు. ఇలా ఇప్పటివరకు మొత్తం ఆరు జీవోలు జారీచేయగా ఉమ్మడి జిల్లాలో 261 మందికి రెగ్యులరైజేషన్ పత్రా లను గత శనివారం మధ్యాహ్నం వరకు జారీచేశారు. మరో ఎంపీహెచ్ఏ (మేల్) ఐదుగురికి, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ కలిపి మొత్తం ఏడుగురికి మాత్రమే క్రమబద్ధీకరణ జీవోలు జారీకావాల్సి ఉంది. రెగ్యులరైజేషన్‌కు ఆర్థికశాఖ ఆమోదం కూడా లభించి కేవలం జీవోల జారీ ప్రక్రియ వద్ద నిలిచిపోయిన ఇటువంటి వైద్య ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 35 మంది మాత్రమే ఉన్నట్టు తెలిసింది. వీరికి జీవోలు జారీ అయితేనే గాని సర్వీసుల రెగ్యులరైజేషన్ జరుగదు. ఒకవేళ ఎన్నికల్లో ప్రభుత్వం మారిపోతే తదుపరి అధికారంలోకి వచ్చే పాలకులు పెండింగ్ రెగ్యుల రైజేషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళనలు వీరిలో నెలకొన్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు తీసుకుని స్వల్ప సంఖ్యలోనే వున్న పెండింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలని అభ్యర్థిస్తున్నారు.

నేడు వైద్య ఉద్యోగుల 'స్పందన'

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18 : జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యో గుల జీతభత్యాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని, పరిష్కార చర్యలు చేపట్టేందుకు ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేసే వైద్యఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గిరిజన దర్బార్ రద్దు

బుట్టాయగూడెం, మార్చి 18 : కేఆర్ పురం ఐటీడీఏలో ప్రతి బుధవారం గిరిజన సమస్యలపై జరిగే గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్టు పీవో ఎం.సూర్యతేజ తెలి పారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున గిరిజన దర్బార్‌ను ఎన్నికల కోడ్ ముగిసేవరకు రద్దు చేసినట్టు పీవో తెలిపారు.



ఉండి కేవీకేలో వరిచేలను పరిశీలిస్తున్న బృందం

రైతులు భూసార పరీక్షలు చేయించాలి

ఉండి, మార్చి 17:రైతులు భూసార పరీక్షలను చేయించాలని తద్వారా పోషక లోపాలను నేల సమస్యలను అధిగమించవచ్చునని ఉండి కేవీకే ప్రోగ్రాం కోఆరి నేటర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ఉండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చును తగ్గిం చుకోవచ్చునని తెలిపారు. డైరక్టరు ఆఫ్ యానిమల్ హస్‌బెండరీ డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు దేశీయ ఆవులను పెంచాలన్నారు. డాక్టర్ వినయ లక్ష్మీ ప్రకృతి వ్యవసాయం, జీవామృతం కషాయం, బయోకల్చర్‌ల గురిం రైతులకు వివరించారు. డీఆర్‌సీ రామలింగేశ్వరరావు, నూకరాజు, ఏవో సంధ్య, డాక్టర్ డిబోరా మెషియానా, డాక్టర్ ఎశ్రీనివాసరావు, బి.రజిత, రైతులు పాల్గొన్నారు.

జగనన్న మాయ

పథకాలు ఇచ్చామంటూ ఇంటింటికీ వలంటీర్లు

ఒక్క రూపాయి ఇవ్వకపోయినా పత్రాల అందజేత

విస్తుపోతున్న కుటుంబాలు



భీమవరంలో టీడీపీ నాయకునికి అందించిన కరపత్రం

భీమవరం మార్చి 18 : "మీ చల్లని దీవెనలు.. దేవుడి ఆశీస్సులతో ఈ ఐదేళ్ల మీ బిడ్డ మీ ఊర్లోనూ మీ ఇంట్లో ఏమి మేలు చేశాడన్నది మీ కళ్ల ముందే కనిపిస్తోంది. ప్రతి గ్రామానికి, ప్రతి పేద కుటుం బానికి అండగా నిలబడగలిగాం. మీ బిడ్డ పాలనలో మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డను ఆశీర్వదించండి...మీ ముఖ్యమంత్రి.."అంటూ నవ రత్నాలు పథకంలో లబ్ధి పొందిన వారికి వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారం చేస్తున్నారు. రూపాయి కూడా అందుకోని వారిని లబ్ధిదారులుగా చెబుతూ ఇంటింటికి వచ్చి పత్రాలు ఇవ్వడంతో విస్తుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వలంటీర్లు రహస్యంగా ఈ కార్యక్రమం చక్కబెడుతున్నారు. భీమవరం టూటౌన్‌లో ఒక ఇంటికి వెళ్లి మీకు మూడు పథకాల ద్వారా సొమ్ములు అందాయని చెప్పడంతో ఆయన విస్తుపోయారు. అసలు ప్రభుత్వ పథకాలకు తాను అనర్హుడినని చెప్పడంతో విస్తుపోవడం వలంటీరు వంతయింది. అలాగే వన్‌టౌన్‌లో ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడిని నివాసానికి వెళ్లి అమ్మ ఒడి పథకం అందిందని, మీరు జగన్‌కు ఓటేయాలని కోరారు. ఇవన్నీ విన్న ఆయన తన తెల్ల కార్డు నాలు గేళ్ల కిందటే రద్దయిందని నాకు పథకం ఎలా వస్తుందని ప్రశ్నించారు..అలాగే వీరవాసరం మండలం పంజా వేమవరంలో కూడా ఇలాగే పథకాలు వచ్చినట్లు కరపత్రాలు పంచడంతో విస్తుపోతున్నారు.

ఆవును ఢీకొని యువకుడి దుర్మరణం

కైకలూరు, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్టు కైకలూరు టౌన్ పోలీసులు తెలిపారు. మండలంలోని ఆటపాక గ్రామానికి చెందిన కిలాడి రాజ్‌కుమార్ (24) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కైకలూరు వస్తుం డగా తాలుకా సెంటర్లో ఆవును ఢీకొట్టాడు. దీంతో రాజ్‌కుమార్ తలకు తీవ్ర గాయా లవడంతో స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఏఎస్‌ఐ పాండురంగారావు కేసు నమోదు చేశారు.

48 గంటలు దాటుతున్నా..

కోడ్ కూయలేదే !

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చి 48 గంటలు గడచినా నిబంధనల అమలులో అధికారులు నిర్లక్ష్యంగానే కనిపిస్తున్నారు.కొన్ని గ్రామాల్లో రాజకీయ ఫ్లెక్సీలు తొలగించలేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పథకాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. గోడలకు వేసిన పార్టీ రంగులు కనిపిస్తున్నాయి. ఫ్లెక్సీల తొలగింపులో వివక్షత ప్రదర్శిస్తున్నారని పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల విగ్రహాలకు సగం.. సగం ముసుగులు వేశారని చెబుతున్నారు.

దర్శనమిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు

పలుప్రాంతాల్లో ముసుగు పడని విగ్రహాలు





ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అధికారులు ఇంకా మేలుకోలేదు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లపై వైఎస్ఆర్ పేరును తొలగించలేదని ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం రావడంతో ఆఘమేఘాల మీద ఆ పేరును వాహనాలపై తొలగించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అత్యవసర విభాగంలో ఉన్న లైటింగ్ డిస్‌ప్లేలో సీఎం చిత్రం కనిపిస్తూనే ఉంది. ఆసుపత్రిలోని వార్డులలో వాల్ పోస్టర్లు అలాగే ఉన్నాయి. ఐసీయూ విభాగంలో ప్రతి బెడ్ వద్ద డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ అనే పేరు రాసే ఉంది.కంటి విభాగానికి వెళ్ళే మార్గంలో లైటింగ్ డిస్‌ప్లే బోర్డు ఉంది అక్కడ కూడా ముఖ్యమంత్రి జగన్ చిత్రం యధావిధిగానే ఉంది. జనరిక్ మెడికల్ షాపుపై ఉన్న జగన్ ఫోటోను సాయంత్రానికి మూసి వేశారు. ఆసుపత్రి నుంచి మృత దేహాలను ఉచితంగా తీసుకువెళ్ళే వాహనంపై డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలు అలానే ఉన్నాయి.

ఏలూరు టూటౌన్ : నిమ్మకాయల మార్కెట్ రోడ్డులో జగనన్న ఫ్లెక్సీలను అధికారులు ఇంత వరకు తొలగించలేదు. చిరంజీవి బస్టాండ్ కొన్ని సచివాలయాల్లో జగన్ ఫోటోలు తొలగించలేదు. పంపుల చెరువు వద్ద సచివాలయంలో జగనన్న ఫోటోలకు ముసుగులు వేయ్యలేదు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు ముసుగులు వెయ్యలేదు.

ఇక్కడేమో అత్యుత్సాహం..

పెంటపాడు : ఎన్నికల కోడ్ నేపధ్యంలో విగ్రహాలకు ముసుగులు వేయ డంలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య సమర యోధుడు లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పంచాయతీ అధికారులు ముసుగు వేశారు. ఇదే కళాశాలలో అంతర్గత రహదారులకు, అదనపు తరగతి గదులకు ప్రజ ప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన శిలా పలకాలు ఉన్నాయి.వాటిని మాత్రం వదిలేశారు.

జాతిపిత, అమరజీవుల విగ్రహాలకు ముసుగు



జంగారెడ్డిగూడెం టౌన్ : కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయ కుల విగ్రహాలకు అధికా రులు ముసుగు వేస్తున్నారు. జంగా రెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఉన్న మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు కూడా ఆసుపత్రి సిబ్బంది ముసుగు వేశారు. తర్వాత పొరపాటు తెలుసుకుని సిబ్బంది ముసుగు తొలగించారు.

వీరవాసరంలో దాత విగ్రహానికి...



వీరవాసరం : వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దాత విగ్రహానికి ముసు గు తొడిగారు. విద్యాభివృద్ధి కోసం సర్వం దానం చేసిన విద్యాదాత మద్దాల రామ కృష్ణమ్మ , ప్రభుత్వ కార్యాలయాల సముదాయం , తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపానికి ఎంతో విలువైన స్థలాన్ని దానం ఇచ్చిన మద్దాల శ్రీరంగనాయకులు విగ్రహాలను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌తో ఈ దాతల విగ్రహాల పక్కన ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయడంతో పాటు పక్కనే ఉన్న మద్దాల శ్రీరంగనాయకుల విగ్రహానికి ముసుగు తొడిగారు. ఇదేమిటంటే వీరవా సరం అభివృద్ధికి మూడు పర్యాయాలు సర్పంచ్‌గా వ్యవహరించిన శ్రీరంగ నాయకులు రాజకీయ నేతేనని చెబుతున్నారు.

పెదవేగి : లక్ష్మీపురంలో వైసీపీ స్థూపం మీద ఉన్న విగ్రహానికి ముసుగేసిన అధికారులు, అదే స్థూపంపై ఎగురుతున్న వైసీపీ జెండాను వదిలేశారు. లక్ష్మీపురంలోని గంగానమ్మ ఆలయం ఎదురుగా టీడీపీ, వైసీపీ, జనసేన ఫ్లెక్సీలు భారీగా కనిపిస్తున్నాయి. కొప్పులవారిగూడెంలో ఫ్లెక్సీలను తొల గిస్తుండగా 'ప్రతిపక్షం ఫ్లెక్సీలను మాత్రమే తొలగించండి. మా ఫ్లెక్సీల జోలికొస్తే ఊరుకోం' అంటూ అధికార పక్షం నాయకుడు ఒకరు బెదిరించారని గ్రామస్థాయి అధికారులు వాపోతున్నారు.

దెందులూరు : దెందులూరులో ప్రభుత్వ స్థలాల్లోని రాజకీయ బ్యానర్లు, జెండాలను అధికారులు తొలగించలేదు. దెందులూరు చెక్‌పోస్టు దగ్గర నుంచి కొవ్వలి అడ్డరోడ్డు దగ్గర వరకు వైసీపీ జెండాలు పెద్ద ఎత్తున ఉన్నా అధికారులు తొలగించే సాహసం చేయడం లేదు.

ద్వారకాతిరుమల :ద్వారకాతిరుమల సచివాలయానికి వేసిన వైసీపీ రంగు ఇంకా అలాగే ఉంది. తిమ్మాపురంలో ఓనేత ఇంటిపై, కొమ్మరలో మా నమ్మకం నువ్వే అంటూ వేసిన ఫెక్సీలు దర్శనమిస్తున్నాయి. తిరుమలం పాలెంలో ప్రదానరహదారుల పక్కన, ఎస్సీ కాలనీ, పలుప్రాంతాల్లో ఫ్లెక్సీల తొలగింపు పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

ఆకివీడు : మెయిన్ సెంటర్, మాదివాడ ప్రాంతంలో ఫ్లెక్సీలు వేలాడు తున్నాయి. అధికారులు పూర్తిగా తొలగించామంటున్నారు. అధికారులు, సిబ్బంది అలసత్వం కొట్టొచ్చినట్లు కనబడుతుంది.



దెందులూరు జాతీయ రహదారిపై...



ఏలూరు రహదారిపై ...



తిమ్మాపురంలో ఓ వైసీపీ నాయకుని ఇంటిపై ..



ద్వారకాతిరుమల మండలం కొమ్మరలో..



పెదవేగి మండలం లక్ష్మీపురంలో ఫ్లెక్సీలు



ఏలూరులో పూర్తిగా ముసుగు వేయని దృశ్యం

స్కూల్స్‌లో కోడ్ అమలు బాధ్యత హెచ్‌ఎంలదే

ఏలూరు ఎడ్యుకేషన్,మార్చి 18 :పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఆహార పదార్థాల ప్యాక్‌లపై ఎన్నికలకోడ్ (ఎంసీసీ) దృష్ట్యా సీఎం ఫొటోలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎండీఎం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కోడిగుడ్లపై ఎటువంటి స్టాంపులు ఉండరాదని ఆదేశించారు. ఇప్పటికే పాఠశాలల్లో వున్న చిక్కీల పాలథిన్ కవర్లను తొలగించిన తర్వాతే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. తొలగించిన పాలథిన్ కవర్లను ఒకచోటకు చేర్చి ధ్వంసం చేయాల్సి ఉంటుంది. వీటితో పాటే సీఎం ఫొటోలువున్న రైస్ బ్యాగ్‌లు, రాగి, బెల్లం పౌడర్ల కవర్లను డిస్పోజ్ చేయాలని సూచించారు. వీటిని అమలు చేయాల్సిన బాధ్యత అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు /ప్రిన్సిపాల్స్ దేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులమలయ్యేలా డీఈవో, డీవైఈవో, ఎంఈవోలు బాధ్యత తీసుకోవాలని కోరారు.



తనిఖీల్లో 2.50 లక్షలు స్వాధీనం

భీమడోలు, మార్చి 18 : భీమడోలు రైల్వే గేటు సమీపంలో పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న చెక్‌పోస్టు తనిఖీల్లో రెండున్నర లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం నుంచి ఏలూరు వెళ్తున్న కారులో రెండున్నర లక్షల రూపాయలు ఉండడాన్ని గమనించి అధికారులు ఆ సొమ్మును సీజ్ చేశారు. 50 వేల రూపాయలకు మించి సొమ్ము తరలిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతులు ఉండాలని లేదంటే ఆ సొమ్మును సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు.

భీమడోలు గ్రామ కార్యదర్శికి మెమో

ఎన్నికల కోడ్ నియమావళి నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన భీమ డోలు గ్రామ కార్యదర్శి ఠాగూర్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఛార్జి మెమో అందజేశారు. భీమడోలు గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఫెక్సీలను, వాల్‌పెయింట్స్‌ను తొలగించకుండా పక్షపాత వైఖరి అవలం భించారంటూ ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. భీమడోలు మండల వ్యాప్తంగా ఉన్న ఫెక్సీలు తొలగించి విగ్రహాలకు ముసుగులు వేశారు.

ఐదుగురికి షోకాజ్ నోటీసులు

ఆచంట,మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారు లందరూ అప్రమత్తంగా ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామినాయుడు అన్నారు. పలు చోట్ల అధికారులు ఫ్లెక్సీలు, బేనర్‌లు తొలగించే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించినందున పోడూరు, నెగ్గిపూడి, కవిటం, నడిపూడి గ్రామాలకు సంబంధించి కార్య దర్శులకు, పోడూరు రైతు భరోసా కేంద్రం ఉద్యోగికి సంబంధించి షోకాజు నోటీసు జారి చేసినట్లు ఆర్‌వో తెలిపారు.

ఎన్నికల నియమావళి ఫిర్యాదులకు కంట్రోల్‌రూం : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 18: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు స్వచ్ఛందంగా కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.చెన్నయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని, మండ లాల పరిధిలోని అన్ని బ్యానర్‌లను, తీయించామని, రాజకీయ నాయ కుల విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. కోడ్ నిబంధనల ఉల్లంఘన ఉంటే కంట్రోల్ రూం నంబర్ 08818-229699కు ఫిర్యాదు చేయ వచ్చని వివరించారు.ఈసారి ఎన్నికల కమి షన్ హోం ఓటింగ్ పద్ధతి ప్రవేశపెట్టిందని అందుకు 220 మందిని గుర్తించామన్నారు. ఒక్కసారి హోం ఓటిం గ్‌కు రిజిస్టర్ అయితే పోలింగ్ స్టేషన్ వద్ద ఓటు వేసేందుకు అవకాశం ఉండ దన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రింటింగ్ ప్రెస్ వారితో మీటింగ్ పెట్టి వారు ముద్రించే ప్రతీ కరపత్రం ఫోన్ నెంబర్, ప్రెస్ పేరుతో వేయా లని సూచిం చామన్నారు. కేబుల్ ఆపరేటర్లు ఎవరి యాడ్ వేసినా కలెక్టర్ కార్యాల యంలోని కంట్రోల్ రూం వద్ద పర్మిషన్ తీసుకున్న తరువాతే వేయాలన్నారు. ఏఆర్‌వో మురళికృష్ణ, ఎన్నికల డీటీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



విచారిస్తున్న డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి

పోలవరంలో పట్టపగలు చోరీ

రూ.20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీ

పోలవరం, మార్చి 18 : పోలవరంలో పట్టపగలు ఇంటి తాళాలు బద్దలు కొట్టి 20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీ చేసిన సంఘటన సోమ వారం మధ్యాహ్నం జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలవరం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన పంతుల వెంకటేష్ దుబాయ్‌లో కొన్నాళ్ళు పనిచేసి వచ్చాడు. వెంకటేష్ భార్య లక్ష్మి సోమవారం కూలి పనికి వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు బీరువా తాళాలు బద్దలు కొట్టి బీరువాలో దాచిన 20 వేల నగదు, 11 కాసుల బంగారం చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్లూస్ సేక రించేందుకు ప్రత్యేక పోలీసు సిబ్బందిని, పోలీసు జాగిలాన్ని రప్పిస్తున్నట్లు డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి , సీఐ మధుబాబు తెలిపారు.

యువకునికి ఏడాది జైలు శిక్ష

ఏలూరు క్రైం, మార్చి 18 : ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని ఒక యువతిని మోసగించిన యువకుడిపై నేరం రుజువు కావడంతో ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు కం మహిళా కోర్టు న్యాయాధికారి రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. పాలకొల్లులోని ఉప్పల నరేష్ (19) ఒక యువతిని ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్ళి చేసుకుంటానని మోసగించాడు. బాధితురాలు 2019లో పాలకొల్లు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ సాగింది. నరేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించారు. ప్రాసి క్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు పాలకొల్లు టౌన్ సీఐ మంగాదేవి, కోర్టు కాని స్టేబుళ్ళు సహకరించారు.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, మార్చి 18 : మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పొలిమేర నాగరాజు అదే గ్రామానికి చెందిన అబ్బ దాసరి కాంతారావును పాత గొడవలను పురస్కరించుకొని గొడ్డలితో దాడి చేయడంతో తలమీద గాయమైంది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో టి.నరసాపురం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరం కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుక్కునూరు మార్చి 18 :వేలేరులో ఏర్పాటు చేసిన పేకాట స్థావరాన్ని సోమవారం కూల్చివేశారు. ఆంధ్రా తెలంగాణ సరిహద్దుల్లో పేకాట జరుగు తున్నదనే విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో పేకాట జోరు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. వేలేరు గ్రామం వెనుక భాగంలో ఒక తోటలో షెడ్ ఏర్పాటు చేసుకొని లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రకి చెందిన జూదరులు ఇక్కడ జరిగే పేకాటలో పాల్గొంటున్నారు. దీనిపై ఆంధ్ర జ్యోతిలో పూర్తిస్థాయిలో వచ్చిన వార్తకు పోలీసు యంత్రాంగం స్పందించింది. ఈ క్రమంలో షెడ్‌ని కూల్చివేయడంతో పాటు పోలీసులు తగిన నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

బైక్ ఢీకొని చిన్నారికి తీవ్ర గాయాలు

స్పీడ్ బ్రేకర్లు వేయాలని దళిత నాయకుల డిమాండ్

పోలవరం, మార్చి 18 : రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థినికి తీవ్ర గాయా లయ్యాయి. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన ఐదేళ్ళ చిన్నారి మరపట్ల భవ్య ఆర్‌సీఎం పాఠశాలలో ఒకటో తరగతి చదువు తోంది. స్కూలు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గూటాల గ్రామం నుంచి వస్తున్న బైకు వేగంగా ఢీకొని ఈడ్చుకుపోవడంతో కాలు విరిగి తీవ్ర గాయాలపాలైంది. ఆ పాపని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్టేషన్ సిబ్బంది తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ నాయకులు గోకా రామకృష్ణ, హరికృష్ణ, కమ్మ రగూడెం దళిత యువకులు మాట్లాడుతూ యడ్లగూడెం నుంచి కమ్మరగూడెం రెండో రోడ్డు వరకూ ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహనాల వేగ నియంత్రణ లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మార్గంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీలు, చర్చిలు ఉండడం వల్ల విద్యా ర్థులు ఎక్కువగా సంచరిస్తారని ప్రమాదాల నివారణకు పోలీసులు, పంచా యతీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేశారు.

భార్య, భర్తల పరస్పర ఫిర్యాదు

భీమవరం క్రైం, మార్చి 18 : భార్యను కాపురానికి పంపించమని అడిగితే ఆమె తరుపు కుటుంబ సభ్యులు ఆరుగురు తనను కొట్టారని భీమవరం పట్ట ణంలోని భీమేశ్వరస్వామి కాలనీకి చెందిన భోగేశ్వరరావు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇదే ఘటనలో తన భర్త భోగేశ్వరరావు మద్యానికి బానిసై అధికకట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని అతని భార్య నాగదుర్గ ఫిర్యాదు చేశారన్నారు. పరస్పర ఫిర్యాదులపై సీఐ శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గోస్తనీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

భీమవరం క్రైం, మార్చి 18 : భీమవరం విస్సాకోడేరు వంతెన సమీపంలోని గోస్తనీ వేల్పూరు పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు వన్ టౌన్ సీఐ శ్రీను చెప్పారు. గుర్రపుడెక్క, తూడులో కుళ్ళిపోయి ఉందన్నారు. జేసీబీ సహాయంతో తూడు తొలగించిన తరువాత మృతదేహాన్ని ఒడ్డుకు తీ సుకొస్తామన్నారు.

యనమదుర్రులో దూకిన వ్యక్తి గల్లంతు

భీమవరం క్రైం, మార్చి 18 :భీమవరం పట్టణంలోని యనమదుర్రు కాలువ చిన్న వంతెనపై నుంచి ఓ వ్యక్తి ఆదివారం రాత్రి కాలువలోకి దూకినట్లు అతని బంధువులు సమాచారం ఇచ్చారని వన్‌టౌన్ సీఐ చెప్పారు. అగ్నిమా పక సిబ్బందితో సోమవారం గాలించగా ఆచూకీ లభించలేదన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 18 : భీమవరం వన్‌టౌన్‌లోని ఓ దుకాణం అరుగుపై సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కూర్చొని కిందకు ఒరిగిపోయి చనిపోయినట్లు సీఐ శ్రీను తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అతని వివరాలు సేకరించగా విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతుడి బంధువులు భీమవరం వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 18 : అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడి నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. బుట్టాయిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలోని సయ్యద్ రబ్బానీ బాబా తన వెల్డింగ్ షాపునకు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు అధికా రులకు సమాచారం అందడంతో విజిలెన్స్ సిబ్బంది తనిఖీలు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి రూ.62,947 రూపాయలు అపరాధ రుసుం విధించారు. మరో ఏడు వేల రూపాయలు జరిమానాగా విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.



ఆగి ఉన్న కారులో మంటలు

నరసాపురం, మార్చి18 : పట్టణంలోని మాదవాయపాలెం రేవులో సోమ వారం ఆగి ఉన్న డీజిల్ కారులో మంటలు చెలరేగాయి. పట్టణానికి చెందిన కానిస్టేబుల్ గోదావరి ఒడ్డున కారు ఆపి తిరిగి ఇంజన్ స్టార్ట్ చేయగానే కారు బ్యానెట్ నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే బకెట్‌లతో నీరు తీసుకువచ్చి మంగలు ఆర్పివేశారు.

న్యాయం చేయాలంటూ మృతుల బంధువుల ఆందోళన



నరసాపురం, మార్చి 18: పట్టణంలోని ఆర్టీసీ బస్టాం డ్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మోషన్ (59) మృతి చెందాడు. ఆపరేషన్ చేసిన తరువాత వైద్యులు సరిగ్గా వైద్యం అందించ లేదంటూ ఆరోపిస్తూ బంధువులు పాలకొల్లు రోడ్‌పై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో అర్ధ రాత్రి ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తగా మారడంతో సీఐ స్వామి సిబ్బందితో ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజాము వరకు ఇరువర్గాలతో చర్చలు జరిపి ఆందోళన విరమింప జేశారు. ఆస్పత్రి వైద్యులు మాత్రం రోగి ఆరోగ్య పరిస్థితిని శస్త్ర చికిత్సకు ముందే వివరించి, వారి అంగీకారంతోనే చికిత్స చేశామన్నారు.




పెదపాడు, పెదవేగి మండలాల్లో పరీక్ష కేంద్రాలకు వెళుతున్న పదో తరగతి విద్యార్థులు



పోలవరం పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ



బుట్టాయగూడెంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



టి.నరసాపురం పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

పది పరీక్షలు ప్రారంభం

బుట్టాయగూడెం, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కేఆర్.పురం, బుట్టాయగూడెం, బూసరాజుపల్లి పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. మొదటిరోజు పరీక్షకు 769 హాజరు కావలసి ఉండగా 90 మంది పరీక్షకు రాలేదని ఎంఈవో టి.బాబురావు తెలిపారు. విద్యార్థులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు పంపారు. దూర ప్రాంతాల విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. కేఆర్ పురం గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పీవో ఎం.సూర్యతేజ సందర్శించారు. మౌలిక సదుపాయాలు పరిశీలించి విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో రాజీపడవద్దని తెలిపారు.

● జీలుగుమిల్లి: బర్రింకలపాడు గిరిజన గురుకుల బాలుర పాఠశాల, జీలుగుమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 552మంది విద్యార్థులకు 494మంది పరీక్షలు రాశారు. 58మంది పరీక్ష హాజరు కాలేదని ఎంఈవో కె.శ్రీనివాస్ చెప్పారు.

● పోలవరం: మండలంలో తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పోలవరం పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది, గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 116 మందికి 100 మంది, కార్మెల్ పురం ఆర్‌సిఎం ఉన్నత పాఠశాలలో 54 మంది విద్యార్థులకు 20 మంది పరీక్షలకు హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మండలంలో పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని ఎంఈవో రాముడు తెలిపారు. 2012 మంది విద్యార్థులకు 1942 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. లక్ష్మవరం, విద్యా వికాస్, చైతన్య, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

● పెదవేగి: మండలంలో ఆరు కేంద్రాల్లో పది పరీక్షలు నిర్వహిస్తున్నారు. 912మంది పరీక్షలు రాయాల్సి ఉండగా తొలరోజు 825 మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట బందోబస్తుతోపాటు తాగునీరు, వైద్య సదుపాయం కల్పించామన్నారు.

● కామవరపుకోట: మండలంలో 4 పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలకు 716 మంది హాజరు కావలసి వుండగా 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.





ద్వారకా తిరుమల పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ, కుక్కునూరులో తహసీల్దార్ పరిశీలన, బుట్టాయగూడెంలో సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

● లింగపాలెం: మండలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా మొదటి రోజు పరీక్ష సాగిందని ఎంఈవో రామారావు తెలిపారు. మొత్తం 696 మంది విద్యార్థులకు నూరు శాతం విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో తెలిపారు.

● చింతలపూడి: మండలంలో పదోతరగతి పరీక్షలకు తొలిరోజు 83మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏడు పరీక్షా కేంద్రాల్లో 1685 మందికి 1602 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. చింతలపూడిలో ఐదు పరీక్షా కేంద్రాలు ప్రగడవరం, యర్రగొండపల్లిలో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశారు.

● పెదపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలో మొత్తం 1157 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 121 మంది గైర్హాజరయ్యారు.

● ఉంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం, బొమ్మిడి హైస్కూళ్లలో 809 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 744 మంది హాజరైనట్లు ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు తెలిపారు.

● టి.నరసాపురం: మండలంలో పదో తరగతి తొలి పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి తెలిపారు. మొత్తం 581మంది విద్యార్థులకు 534మంది విద్యార్థులు హాజరు కాగా 47మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు.

● కుక్కునూరు: మండలం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కుక్కునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 197మంది విద్యార్థులకు 182 మంది పరీక్షకు హాజరుకాగా 15 మంది హాజరు కాలేదు. కుక్కునూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సెంటర్‌లో 124 మంది విద్యార్థులకు 111 మంది హాజరు కాగా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో గిరి భగవాన్ దాస్ తెలిపారు. తహసీల్దార్ అచ్యుత కుమారి పర్యవేక్షించారు.

● ద్వారకాతిరుమల: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మంచి మార్కులతో పాస్ అయ్యేలా దీవించు స్వామీ అంటూ విద్యార్థులు పాదుకా మండపం వద్ద శ్రీవారిని మొక్కుకున్నారు. మండలంలో ద్వారకాతిరుమల దేవస్థానం స్కూల్, శ్రీనివాసా జూనియర్ కళాశాల, డిపాల్ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా మొత్తం 356 మంది విద్యార్థులుండగా 52 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఎంఈవోలు పరసా వెంకట్రావు, శ్రీనివాసరావు తనిఖీ చేశారు.

తల్లిదండ్రులను ఆదరించని పిల్లలపై కేసులు : కలెక్టర్



న్యాయం చేయాలని కోరుతున్న వృద్ధురాలు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 18: తల్లిదండ్రులను ఆదరించని పిల్లలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. ద్వారకా తిరుమల మండలానికి చెందిన వృద్ధురాలిని కుమారులు నిర్లక్ష్యం చేయడంతో చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం విధుల అనంతరం క్యాంప్ కార్యాలయానికి బయల్దేరిన కలెక్టర్‌ను ద్వారకాతిరుమల మండలం కన్నాపురం గ్రామానికి చెందిన బొప్పన చిట్టెమ్మ కలసి తన బాధ తెలిపి న్యాయం చేయాలని కోరింది. తనకు ముగ్గురు కుమారులు అని, పెద్ద కుమారుడు, మూడో కుమారుడు మరణించారని, రెండో కుమారుడు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఎటువంటి ఆధారం లేదని, న్యాయం చేయా లని కలెక్టర్ వద్ద విలపించింది. చిట్టెమ్మ బాధను అర్థం చేసుకున్న కలెక్టర్ వెంటనే ద్వారకాతిరుమల తహసీల్దార్‌కు ఫోన్‌చేసి తక్షణం విచారణ చేయాలని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చారని తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసే వారిని ఉపేక్షించవద్దని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



సూచనలు ఇస్తున్న ఏపీడీ పురుషోత్తం

పెదవేగి, మార్చి 18: ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి పని కల్పించాలని బాధ్యత ఉందని డ్వామా ఏపీడీ పురుషోత్తం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పని ప్రదేశంలో కూలీల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మంచినీరు, అత్యవసర మందులు, నీడ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. జూన్ లోపు పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, వేసవిని దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా పనివేళల్లో మార్పులు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎన్నికల అధికారులు

లింగపాలెం, మార్చి 18: ధర్మాజీగూడెం వలసపల్లి చెక్‌పోస్టు వద్ద డీటీ సునీత ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ నిర్వహించారు. ఆర్డీవో అద్దయ్య ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదు, బంగారం, వెండి తదితర వస్తువులను తీసుకువెళితే సరైన పత్రాలు, రశీదులు దగ్గర ఉంచుకోవాలన్నారు. లేదంటే వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మద్యం రవాణా నేరమని, అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరూ ఎక్కువ నగదు తీసుకువెళ్ళాల్సి వచ్చినా దానికి సరిపడా రశీదులను, సరైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని తెలిపారు. ఆమెతో పాటు శంకర్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న టీవీఎస్ రాజు, తదితరులు

టి.నరసాపురం, మార్చి 18: రాబోయే పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ నేత టీవీఎస్.రాజు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. మక్కినవారి గూడెం ఏఐటీయూసీ కార్యాలయంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ, అవకాశవాదులైన టీడీపీ-జనసేన, ఆర్థిక నేరస్థుడు జగన్మోహన్ రెడ్డిని చిత్తుగా ఓడించి సీపీఐ, సీపీఎం భాగస్వాములుగా ఉన్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. నరేంద్ర మోదీ విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలను కార్పొరేట్‌లకు కట్టబెట్టి దేశంలో నిరుద్యోగం పెంచాడని విమర్శించారు. విభజన హామీలు అమలులో ఘోరంగా విఫలమయ్యాడన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సతీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో న్యూడెమోక్రసీ పోటీ

బుట్టాయగూడెం, మార్చి 18: పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థి పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 50 ఏళ్లకు పైగా ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతర పేద ప్రజల అభివృద్ధికి న్యూడెమోక్రసీ అనేక పోరాటాలు చేసిందన్నారు. కూలి రేట్లు, పాలేరు జీతాలు పెరుగుదల, వెదురు, అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలపై ఆందోళనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజల్లో ఉండే తాముకూడా పోటీలో ఉంటామన్నారు. అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

జగదాంబకు కూటమి ఆశావహ అభ్యర్థి పూజలు

జీలుగుమిల్లి, మార్చి 18: జీలుగుమిల్లి జగదాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కూటమి ఆశావహ ఎమ్మెల్యే అభ్యర్థి మొడియం సూర్య చంద్రరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పి.ప్రసాద్, ఎం.హరికృష్ణ, టిఎస్.రామకృష్ణశర్మ పూజలు చేయించారు. అధికారులు శాలువా కప్పి సత్కరించారు. ఆలయ మర్యాదలతో శాలువకప్పి సత్కరించారు. పోలవరం అసెంబ్లీ టిక్కెట్ తనకు కేటాయిస్తే అందరు తన విజయానికి కృషి చెయ్యాలని కోరారు. అనంతరం గ్రామంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పసుపులేటి రామును ఆయన కలిశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ కక్కిరాల రాము, చక్రి, చిర్రి వెంకటేశ్వరావు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, ఉలవల వెంకటరమణ, మైలవరపు లక్ష్మణ ఉన్నారు.



భీమడోలు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న గన్ని



ఏలూరులో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



లింగపాలెం మండలంలో బీసీ నాయకుల ప్రచారం



బిషప్ జయరావు ఆశీర్వాదం తీసుకున్న చింతమనేని

కూటమిదే విజయం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

భీమడోలు, మార్చి 18 : రాష్ట్రంలో రానున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రజాగళం సభ విజయవంతం కావడమే నిదర్శనమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. గన్ని మాట్లాడుతూ సైకో జగన్ చేస్తున్న అరాచకం అంతం కాబోతుందనేది ప్రజాగళం సభతో స్పష్టమైందన్నారు. జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని, వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర సర్వనాశనమైందన్నారు. ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ప్రజలకు అర్థమైందని, జగన్ పాలనలో ఆర్థిక దుర్వినియోగం అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. కలెక్టరేట్ కార్యాలయాలు, రైతు బజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో సహా అనేక ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీ ఒకే కుటుంబానికి చెందినవని గన్ని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు లబ్ధి

చింతలపూడి: తెలుగుదేశం పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి చేకూరిందని, వైసీపీ పాలనలో ఒరిగింది ఏమీ లేదని టీడీపీ నేత జె.ముత్తారెడ్డి, టీడీపీ, జనసేన అభ్యర్థి రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి మండలం నామవరం, పట్టాయిగూడెం గ్రామాల్లో వైసీపీ నుంచి 500 మంది టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. గఫూర్, వినోద్, రాజారావుకు కండువాలు కప్పి అనుచరులను ఆహ్వానించారు. ముందుగా నామవరం, పట్టాయిగూడెం గ్రామాల్లో అభ్యర్థి రోషన్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామానికి రోడ్లు, బస్సు సౌకర్యం లేక 20 ఏళ్లుగా నరకం చూస్తున్నామని అభ్యర్థి రోషన్ కుమార్ దృష్టిలో పెట్టారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే బోయిగూడెం, సీతానగరం రోడ్డుసమస్యలతో పాటు బస్సులు తిరిగే విధంగా కృషిచేస్తానన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోందని, ఈ మార్గాల్లో బస్సు సౌకర్యం లేనందున వారికి ఉపయోగపడే విధంగా బస్సులు తిరిగే విధంగా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరానేని గోపి, జె.వెంకటేశ్వరరావు, గోరుముచ్చు గోపాల్ యాదవ్, సత్యంబాబు, నాయనబాబు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోనేరు సుబ్బారావు, కోటగిరి వేణు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ బీసీల వెన్నంటి ఉంటుంది

లింగపాలెం: టీడీపీ బీసీ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు ఆధ్వర్యంలో బీసీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. లింగపాలెం, యడవల్లి, ధర్మాజీగూడెం, అయ్యప్పరాజుగూడెం, రంగాపురం గ్రామాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌ను గెలిపించాలని వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు వెన్నెముక లాంటిదని, బీసీలకు అనేక సంక్షేమ పథకాలను టీడీపీ హయాంలోనే అందించిందన్నారు. బీసీలంతా తెలుగుదేశంపార్టీకి ఓటువేసి గెలిపించుకోవాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. నందిగం వెంకట సుబ్బారావు, నరం సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, మల్లికార్జున్‌రావు, పలువురు బీసీ నాయకులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియంత పాలనలో ఎవరికి ప్రయోజనం కలగలేదు

ఏలూరు టూటౌన్: రాష్ట్రంలో ఐదేళ్ల నియంతపాలనలో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి విమర్శించారు. 15వ డివిజన్ అధ్యక్షుడు ఎన్.నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం వందలాది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చంటి మాట్లాడుతూ విధ్వంసకర పాలనకు కొన్ని రోజుల్లో విముక్తి కలిగిస్తామన్నారు. తుగ్లక్ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు 28, బీసీలకు 30, మైనార్టీలకు 11పథకాలను రద్దు చేశాడని అన్నారు. రాక్షస పాలనకు అంతం చేయడానికి అందరూ నడుం బిగించాలని అన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, కే.మాణిక్యం, కే.వాసు తదితరులు పాల్గొన్నారు.

బిషప్ జయరావు ఆశీస్సులు తీసుకున్న చింతమనేని

ఏలూరు టూటౌన్: దెందులూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ బిషప్ జయరావు పొలిమేర ఆశీస్సులు తీసుకున్నారు. ఏలూరు బిషప్ హౌస్‌లో ఏలూరు కథోలిక పీఠాధిపతి, మోస్ట్‌రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేరను కలుసుకున్నారు. బిషప్‌కు విశాఖపట్నం అడ్మినిస్ట్రేటర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించిన సందర్భంగా చింతమనేని శుభాకాంక్షలు తెలిపారు. బిషప్ జయరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మంచి జరగాలని ఆశీస్సులు అందజేశారు. అమలోద్భవి కథీడ్రల్ చర్చ్‌లో ఫాదర్ మైకేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గంగానమ్మను దర్శించుకున్న రోషన్



అమ్మవారిని దర్శించుకున్న రోషన్

జంగారెడ్డిగూడెం టౌన్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ గంగానమ్మ ఆలయంలో సోమవారం పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు రోషన్ తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆలయం వద్ద కోలాటం చేస్తున్న చిన్నారులతో కలిసి కోలాటం వేసి సందడి చేశారు.

ప్రజాగళం సభ విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

కామవరపుకోట, మార్చి 18: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభ విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ తెలిపారు. పాతూరులో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అంచనాలకు మించి ప్రజలు హాజరయ్యారని చెప్పారు. సభతో కేడర్‌లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు వజీర్‌ఖాన్, కొయ్యగూర స్వామినాధం, కరిపోతు కృష్ణ, గోపాలకృష్ణ, సుభాష్ తదితరులు ఉన్నారు.

డిజిటల్ మార్కెటింగ్ వినూత్న వేదిక

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 18: విభిన్న మార్కెటింగ్ వ్యూహాలకు డిజిటల్ మార్కెటింగ్ వినూత్న వేదిక అని సవిదా డిజిటల్స్ డైరెక్టర్ లలిత అన్నారు. డిజిటల్ మార్కెటింగ్ అంశంపై సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆమె మాట్లాడారు. రాబోయే తరాలకు ఇది సరికొత్త సంపాదనా మార్గమని వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియా లేదా ఇంటర్నెట్ ద్వారా మార్కెటింగ్ ఉత్పత్తులు, వస్తుసేవల రూపమే డిజిటల్ మార్కెటింగ్ అని వివరించారు. ఏదైనా ఉత్పత్తి ప్రకటనలను ఎంతమంది వినియోగదారులు వీక్షిస్తున్నారు, ఎంత మంది ఆకర్షింపబడ్డారు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ మెర్సీ, మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకురాలు విజయలక్ష్మి, హెబ్సిబా, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కార్యక్రమం

బుట్టాయగూడెం, మార్చి 18: మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్లో సోమవారం లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమం జయహో ధరణి జయహో పేరుతో జరిగింది. చిన్నారుల ద్వారా సమాజానికి ప్రభుత్వానికి మంచి సందేశాన్ని ఇచ్చే ఉద్దేశంతో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారి ఆధ్వర్యంలో ఎల్ఆర్ కృష్ణబాబు సారథ్యంలో 3333 మంది విద్యార్థులు మారుమూల ప్రాంతాల్లో పర్యావరణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ జెట్టి నాగేంద్రబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింటమ్మ జాతర



కొణికిలో పెద్దింటమ్మకు పూజలు

పెదపాడు, మార్చి 18 : కొణికి గ్రామం సమీపంలోని పెద్దింటమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విశేషాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఘంటా ప్రసాదరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గంపా వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పాటిమ్మ ఆలయ వార్షికోత్సవం

దెందులూరు, మార్చి 18: చల్లచింతలపూడి-పెరుగుగూడెం గ్రామాల మధ్య పాటిమ్మ ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ఆలయ ట్రస్టు ఛైర్మన్, పెరుగుగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు అమ్మవారికి పుట్టింటి సారె, బోనాలతో పసుపు, కుంకుమ సమర్పించారు. 108 మంది ముత్తైదువులు 108 కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు, భారీ అన్నదానం నిర్వహించారు.

రాచూరు పల్లాలమ్మకు సామూహిక కుంకుమార్చన

ఉంగుటూరు, మార్చి 18: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దింటమ్మకు వెండి బిందె బహూకరణ

కైకలూరు, మార్చి 18: కొల్లేటికోట శ్రీపెద్దింటమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. సోమవారం అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కొరిపల్లి ముత్యాలరావు, భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారికి 1.498 కేజీల వెండి బిందెను బహూకరించారు. ఆలయ అధికారి కేవీ.గోపాలరావుకు అందించారు. అర్చకుడు పేటేటి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గులాబీలతో అర్చన, ధూపసేవా, బాలభోగం, పంచహారతులు తదితర పూజలు చేశారు.

ధర్మరాజు స్వగ్రామం ఫత్తేపురంలో ప్రచారం

గెలిపిస్తామని వాగ్దానం చేసిన గ్రామస్తులు

నిడమర్రు, మార్చి 18: రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఫత్తేపురం గ్రామస్తులను ఉంగుటూరు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కోరారు. తన స్వగ్రామం ఫత్తేపురంలో స్థానికులతో కలసి సోమవారం ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికలలో తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఫత్తేపురం గ్రామం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూర్తిరాజు తర్వాత తనకు అవకాశం వచ్చిందని, కూటమి తరపున పోటీ చేస్తున్న తన విజయానికి సహకరించాలని కోరారు. వైసీపీ అరాచక పాలన అంతమొందించే అవకాశం వచ్చిందని, రాబోయే రోజులలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటువుతుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామస్థులంతా కలసి ధర్మరాజును అభ్యర్థిగా గెలిపించుకొంటామని ఆయనకు వాగ్దానం చేశారు. ఉప సర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, అడ్డాడ రఘు, చింతలపాటి బాసిరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

ట్రిపుల్ ఐటీలో 'సంగీత సుధ'పై వర్క్‌షాప్

నూజివీడు టౌన్, మార్చి 18: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సంగీత విభాగం ఆధ్వర్యంలో 'సంగీత సుధ' అనే అంశంపై వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతంలో ఉన్నత సాధనా పద్ధతులపై కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత మండా సుధారాణి, సాహితీవేత్త డాక్టర్ మండా రామ్‌ప్రసాద్ సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం అనే అంశాలను సమ్మిళితం చేస్తూ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ట్రిపుల్ ఐటీ ఏవో చంద్రశేఖర్, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనం

ఎక్కడి పనులు అక్కడే..

నిలిచిపోయిన సచివాలయం, ఆర్బీకే భవనాలు

అసంపూర్తి నిర్మాణాల్లో అసాంఘిక కార్యకలాపాలు

లింగపాలెం, మార్చి 18: అభివృద్ధి పనులు అంతంతం మాత్రం. అవి కూడా అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అయింది. మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు మధ్యలోనే నిలిచిపోవడంతో అసంపూర్తి నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండలంలోని తువ్వచిలుకరాయుడుపాలెం, కొత్తపల్లి, కలరాయనిగూడెం, తదితర గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం పునాది దశ, శ్లాబ్ దశలో నిలిచిపోయాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా వసతులు కల్పించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి 21.8 లక్షలు, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లకు రూ.20.8 లక్షలు, గ్రామ సచివాలయ భవనానికి రూ.40లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అసంపూర్తి నిర్మాణాలతో ప్రజాధనం దుర్వినియోగమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది సెప్టెంబరులో అప్పటి సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఈ నిర్మాణాలను పరిశీలించారు. బిల్లులు చెల్లిస్తున్నా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ 21 నాటికి ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన హెచ్చరించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు స్పందించలేదు. అప్పటి నుంచి పనులు నిలిచిపోయిన దశలో ఉన్నాయి. సబ్ కలెక్టర్ ఆదేశించినా కాని కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం. నిర్మాణాలను పూర్తిచేసి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ జగన్నాథంను వివరణ కోరగా కాంట్రాక్టర్లకు బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నా నిర్మాణాలు పూర్తిచేయలేదన్నారు. నిర్మాణాలపై కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు త్వరలోనే పూర్తయ్యేలా చూస్తామన్నారు.



పునాదుల దశలో నిలిచిపోయిన నిర్మాణం

మినుము అధరహో

రైతుల్లో ఆనందం



ముదినేపల్లి రూరల్, మార్చి 18: గత ఏడాది డిసెంబరులో సంభవించిన తుఫాన్ కారణంగా ఖరీఫ్ సాగు అనంతరం రబీలో చేపట్టిన మిను ము సాగు ఆలస్యం అవ్వడం తో దిగుబడులు తగ్గాయి. దీంతో మినుముల ధరలు పైపైకి ఎగబాకుతు న్నాయి. గత ఏడాది ఇదే సమయంలో క్వింటాలు రూ. 7500 పలకగా ప్రస్తుతం క్వింటాలు రూ. 10000 ఉంది. ఇప్పుడిప్పుడే పంట అరకొరగా మార్కెట్లోకి రావడంతో వ్యాపారులు ఎగబడి మినుములు కొనుగోలు చేస్తున్నారు. ధర చూసి రైతులు సంతోషంలో ఉన్నప్పటికి మరోపక్క దిగుబడులు నిరాశను కలిగిస్తున్నాయి. దిగుబడులు తగ్గినప్పటికీ ధర ఆశించిన స్థాయి కంటే అధికంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వెల్లి విరుస్తోంది. మూడేళ్లుగా మినుముకు ధర ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దిగుబడులు వచ్చినా ధర లేక నష్టాల పాలయ్యారు. ఈ ఏడాది ధరలు మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొనడంతో పలువురు బడా రైతులు, వ్యాపారులు మినుములను నిల్వచేసే అవకాశం ఉంది. మరోపక్క సన్న, చిన్నకారు, కౌలు రైతులు ధర ఆశించిన స్థాయి కంటే అధికంగా ఉండటంతో త్వరితగతిన మినప తీతలు పూర్తి చేసి నూర్పిళ్ళు చేసి వెంటనే విక్రయించాలన్న ఆతృతలో ఉన్నారు.

తల్లిదండ్రులను ఆదరించకుంటే చర్యలు : కలెక్టర్



న్యాయం చేయాలని కోరుతున్న వృద్ధురాలు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 18: తల్లిదండ్రులను ఆదరించని పిల్లల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంక టేశ్ అన్నారు. ద్వారకా తిరుమల మండలానికి చెందిన వృద్ధురా లిని కుమారులు నిర్లక్ష్యం చేయ డంతో చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం విధుల అనంతరం క్యాంప్ కార్యాలయానికి బయల్దేరిన కలెక్టర్‌ను ద్వారకాతిరుమల మండలం కన్నాపురం గ్రామానికి చెందిన బొప్పన చిట్టెమ్మ కలసి తన బాధ తెలిపి న్యాయం చేయాలని కోరింది. తనకు ముగ్గురు కుమారులు అని, పెద్ద కుమారు డు, మూడో కుమారుడు మరణించారని, రెండో కుమారుడు తనను పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఎటువంటి ఆధారం లేదని, న్యాయం చేయా లని కలెక్టర్ వద్ద విలపించింది. చిట్టెమ్మ బాధను అర్థం చేసుకు న్న కలెక్టర్ వెంటనే ద్వారకాతిరుమల తహసీల్దార్‌కు ఫోన్‌చేసి తక్షణం విచారణ చేయా లని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చారని తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసే వారిని ఉపేక్షించవద్దని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

అక్రమంగా చేపలు పట్టిన 18 మందిపై కేసు

ముసునూరు, మార్చి 18: గోగులంపాడు రామలింగం చెరువులో అక్రమంగా చేపలు పట్టిన 18 మందిపై కేసు నమోదు చేసినట్టు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. నూజివీడుకు చెందిన హుస్సేన్ అనే వ్యక్తి గోగులంపాడు రామలింగం చెరువును వేలంలో పాడుకుని చేపలు పెంచుతున్నాడు. స్థాని కులైన పిల్లి లోకరాజుతోపాటు మరో 17 మంది సోమవారం అక్రమంగా చెరువు లో చేపలు పడుతుండగా హుస్సేన్ వారిని అడ్డుకున్నాడు. దీంతో వారు తనపై దాడికి దిగినట్టు బాధితుడు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో 18 మంది నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆవును ఢీకొని యువకుడి మృతి

కైకలూరు, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్టు కైకలూరు టౌన్ పోలీసులు తెలిపారు. మండలంలోని ఆటపాక గ్రామానికి చెందిన కిలాడి రాజ్‌కుమార్ (24) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కైకలూరు వస్తుండగా తాలుకా సెంటర్లో ఆవును ఢీకొట్టాడు. దీంతో రాజ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధు వుల ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఏఎస్ఐ పాండురంగారావు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పనిచేయని ఏటీఎం

సొమ్ము కోసం ముసునూరు వాసుల పాట్లు



ముసునూరు, మార్చి 18: ముసునూరు మెయిన్ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయకపోడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూమారు 15 రోజులుగా ఏటీఎం పనిచేయకున్నా బ్యాంక్ అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. చింతలవల్లి, కొర్లకుంట, ముసునూరు తదితర గ్రామాలకు చెందిన బ్యాంక్ ఖాతాదారులు నగదు కోసం వచ్చి ఏటీఎం పనిచేయకపోడంతో నిరాశతో వెళ్ళిపోతున్నారు. ఇప్పటికైనా ఏటీఎంను వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు. దీనిపై ముసునూరు ఎస్‌బీఐ మేనేజర్ కె.మహేష్‌ను వివరణ కోరగా ఏటీఎంలోని లాకర్ మరమ్మతుకు గురైయిందని, ఇప్పటికే రెండుసార్లు మరమతు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, రెండు రోజుల్లో ఏటీఎంను వినియోగంలోకి తెస్తామని ఆయన తెలిపారు.

ఉత్తమ పంచాయతీలో.. దాహం కేకలు

- పెదలంకలో అడుగంటిన మంచినీటిచెరువు
- ఫిల్టర్ చేయకుండానే మూడు రోజులకొకసారి సరఫరా?
- రంగుమారి కలుషితం
- రోగాల భయంలో గ్రామస్థులు



పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు

కలిదిండి, మార్చి 18: ఉత్తమ పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న పెదలంక గ్రామంలోని తాగునీటి చెరువు అడుగంటింది. చెరువు నీరు రంగుమారింది. దీనికి తోడు కొంగలు వాలి నీటిని కలుషితం చేస్తున్నాయి. ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. నీటిని ఫిల్టర్ చేయకుండా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నా రు. ఆర్థిక స్థోమత గల వారు ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీరు కొనుగోలు చేస్తుండగా, పేదలు, వృద్ధులు ఆ కలుషిత నీరే తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నీటితో స్నానం చేస్తుంటే శరీర మంతా దురదలు వస్తున్నాయని వాపోతున్నారు. పెదలంకలో సుమారు ఐదు వేల మంది జనాభా ఉన్నారు. మంచినీటి చెరువు విస్తీర్ణం ఎనిమిది ఎకరాలే కావటంతో మూడు నెలల్లో చెరువు ఎండిపోతోంది. మంచినీటి చెరువును విస్తరించాలని ప్రజా ప్రతి నిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. తాగునీటి చెరువును పూర్తిస్థాయిలో నింపి రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా మూడు నెలల్లో చెరువు అడుగంటుతోందని వాపోతున్నారు. చెరువుల్లో నీరు తగ్గి నెల రోజులు గడుస్తున్నప్పటికీ తాగునీటి వంతు ఇరిగేషన్ అధికారులు ఇవ్వక పోవటంతో పలు అవస్థలు పడుతున్నామని ఇదే పరిస్థితి కొనసాగితే ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో తాగునీరు కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామ స్థులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి నెలలో మంచినీటి చెరువులు నింప టానికి తాగునీటి వంతు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవటంతో కాల్వలో నీరు చెరువు కు సరఫరా కాకపోవడంతో నింపలేక పోయారు. వారం రోజుల్లో చెరువు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని పాలకులు, సంబంధిత ఉన్నతాధి కారులు స్పందించి అడుగంటిన చెరువును నింపాలని ప్రజలు కోరుతున్నారు.

నెల క్రితమే అధికారులకు విన్నవించాం..



తాగునీటి చెరువు నింపటానికి నీటి వంతు ఇవ్వాలని నెల రోజుల క్రితమే ఇరిగేషన్ అధికారులకు విన్నవించాం. ఫిబ్రవరి నెలలో పూర్తిస్థాయిలో తాగునీటి వంతు ఇవ్వక పోవటంతో చెరువు వద్దకు నీరు సరఫరా కాక తాగునీటి చెరువును నింపలేకపోయాం. తాగునీటి వంతు ఇస్తే గ్రామస్థుల సహకారంతో యుద్ధప్రతిపదికన మోటార్ పంప్ సెట్లతో చెరువు నింపుతాం.

-మోకా లక్ష్మీరామకృష్ణ, సర్పంచ్



మాట్లాడుతున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి

నిర్మాణ కార్మికులకు వైసీపీ ద్రోహం : కొలుసు

నూజివీడు, మార్చి 18: భవన నిర్మాణ కార్మికులకు వైసీపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని నూజివీడు టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమా వేశమై మాట్లాడుతూ అనుభవం లేని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే పాలన ఏ విధంగా ఉంటుందో నేటి ఆంధ్రప్రదేశ్‌ను చూస్తే తెలుస్తోందన్నారు. అధికారం లోకి వచ్చీ రాగానే ఇసుక పాలసీ మార్పు పేరుతో భవన నిర్మాణ, అనుబంధ కార్మికుల కడుపుకొట్టిన ముఖ్యమంత్రి చరిత్రలో ఎక్కడా చూడలేదన్నారు. చివరికి మరుగుదొడ్ల నిర్మాణానికి కూడా ఇసుకలేని పరిస్థితిని తొలి రెండేళ్లలో ఏర్పడేలా చేసి తరువాత లారీ ఇసుక రూ.25 వేలకు కొనాల్సిన దుస్థితిని రాష్ట్రంలో జగన్ తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడాలంటే దార్శనికత ఉన్న చంద్రబాబును సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందుతాయని, సంపద సృష్టి చంద్రబాబు ఒక్కరికే తెలుసన్నారు. పలువురు భవననిర్మాణ కార్మికులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దరబోయిన ఆత్మీయ సమావేశం



నూజివీడు, మార్చి 18: తాను రాజకీయా ల్లో చురుగ్గా పాల్గొన టం మింగుడు పడకే కొన్ని వర్గాల నాయకు లు తనకు టిక్కెట్ లేకుండా చేశారని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆరోపించారు. నూజివీడు మండలం మీర్జాపురం శివారు కంచ్రికగొల్లగూడెంలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభిమానుల బలంతో నూజివీడు నియోజకవర్గంలో తాను గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు.



ముదినేపల్లిలో పోలీసు అధికారులు, సీఐఎస్ఎఫ్ జవాన్ల కవాతు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ముదినేపల్లి, మార్చి 18 : ముదినేపల్లిలో సోమవారం సాయంత్రం పోలీసులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బంది ముదినేపల్లిలోని అన్ని వీధుల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు తమ సహకారం ఉంటుందని, అదే సమ యంలో ప్రజలు కూడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులకు సహకరించాలని సీఐ కృష్ణకుమార్ కోరారు.

పెద్దింటమ్మకు వెండి బిందె బహూకరణ



కైకలూరు, మార్చి 18: కొల్లేటికోట శ్రీపెద్దింటమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మ వారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి గులాబీలతో అర్చన, ధూపసేవా, బాలభోగం, పంచహారతులు తదితర పూజలను ఆలయ అర్చకులు పేటేటి శర్మ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, భక్తులకు ప్రసాదాన్ని భుజబలపట్నానికి చెందిన ముదునూరి కొండరాజు దంపతులు అందజేశారు. అలాగే అమ్మవారికి 1.498 కేజీల వెండి బిందెను ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కొరిపల్లి ముత్యాలరావు, భాగ్యలక్ష్మి దంపతులు బహూకరించారు. ఈ బిందెను ఆలయ అధికారి కేవీ గోపాలరావుకు అందించారు. రాత్రి పసుమర్తి శ్రీవల్లీ బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన, రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

ట్రిపుల్ ఐటీలో 'సంగీత సుధ'పై వర్క్‌షాప్

నూజివీడు టౌన్, మార్చి 18: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సంగీత విభాగం ఆధ్వర్యంలో 'సంగీత సుధ' అనే అంశంపై వర్క్‌షాపును నిర్వహించా రు. ఈ సందర్భంగా సంగీతంలో ఉన్నత సాధనా పద్ధతులపై కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత మండా సుధారాణి, సాహితీవేత్త డాక్టర్ మండా రామ్‌ప్రసాద్ సాహిత్యం, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం అనే అంశాలను సమ్మిళితం చేస్తూ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ట్రిపుల్‌ఐటీ ఏవో చంద్రశేఖర్, దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలుకు సహకరించాలి : ఎంపీడీవో



చాట్రాయి, మార్చి 18: కోడ్ అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీవో మంగా కుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయా ల్లో ఉన్న ఫ్లెక్సీలు, స్టిక్కర్లు పూర్తిగా తొలగించి ఎన్నికల కమిషన్‌కు సమా చారం ఇచ్చామన్నారు. గ్రామాల్లో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయ టంతో పాటు, వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాల తొల గింపు ప్రక్రియ ముమ్మరంగా చేపట్టామన్నారు. ఊరేగింపులు, బహిరంగ సభలకు సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించటానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి శివనాగరాజు పాల్గొన్నారు.

21 నుంచి అమృతేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్, మార్చి 18: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లో వేంచేసి ఉన్న అమృతేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 21 నుంచి 24 వరకు జరుగుతాయని, ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించిన అనంతరం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, గ్రామో త్సవం జరుగుతుందన్నారు. 22న ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్ర కుంకుమా ర్చన, స్వామివార్ల కల్యాణోత్సవం, 23న ప్రత్యేక పూజలు, 24న పవళింపుసేవ జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణమహోత్సవాలు తిలకించాలని ఆయన కోరారు.

పాముకాటుకు గురైన భవానికి పరామర్శలు

నూజివీడు, మార్చి 18: పాముకాటుకు గురై అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాట్రేనిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పిన్నిబోయిన వీరయ్య కుమార్తె భవానీని నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు.

నూజివీడు టౌన్: ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో పాముకాటుకు గురైన మహిళను మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన సోమవారం పరామర్శించారు. నూజివీడు అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పిన్నిబోయిన వీరయ్య కుమార్తె భవాని పాముకాటుకు గురి కావడంతో భవానీని, ఆమె కుటుంబసభ్యులను ముద్దరబోయిన పరామర్శించారు.

కృత్రిమ కాలు వితరణ



ఆగిరిపల్లి, మార్చి 18: అవసరంలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమని హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మి అన్నారు. వ్యాపారవేత్త అడుసుమల్లి ప్రతాప్ తన సతీమణి కృష్ణకుమారి స్మృత్యర్థం అందజేసిన విరాళంతో ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో గల కృత్రిమ అవయవ కేంద్రంలో నిడదవోలుకు చెందిన బాలిక బట్టు శ్రుతికి కృత్రిమకాలు అందజేశారు. హీల్ డైరెక్టర్ టి.భాస్కర్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ముదినేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహ దిమ్మెపై అక్షరాలకు రంగు, పక్కన పడవేసిన ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు.. కలిదిండిలో విగ్రహానికి ముసుగు

ఫ్లెక్సీల తొలగింపు.. విగ్రహాలకు ముసుగులు

ముసునూరు, మార్చి 18: కోడ్ అమలులో అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం ప్రధాన, అంతర్గత రహదారుల పక్కన ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో కొర్లకుంట, ముసునూరు, చింతలవల్లి తదితర గ్రామాల ప్రధాన రహదా రుల్లోని ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మంగళవారం మధ్యా హ్నం నాటికి గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగింపు, విగ్రహాలకు ముసుగులు వేయాలని ఫ్లయింగ్ స్క్వాడ్ బీవీఎస్ సుబ్బారావు ఆదేశించారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలిదిండి: కోడ్ అమల్లోకి రావటంతో కలిదిండి మండలంలో అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. కలిదిండితోపాటు కోరుకొల్లు, పడమటిపాలెం, ఎస్.ఆర్పీ అగ్రహారం, సానా రుద్రవరం, కోరుకొల్లు, గుర్వాయిపాలెం, మూల్లంక, పెదలంక గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైఎస్ విగ్రహాలతోపాటు మాజీ ఎమ్మెల్యే రంగా విగ్రహానికి అధికారులు ముసుగులు వేశారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు తొలగించారు. ఎంసీసీ ఇన్‌చార్జ్ దినతేజ్, ఈవోపీఆర్డీ రాజారావు ఆధ్వర్యంలో కార్యదర్శులు ఫ్లెక్సీలను తొలగించారు.

ముదినేపల్లి: మండలంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఎంపీడీవో గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్, వైఎస్, రంగా విగ్రహాలకు పరదాలు కట్టేశారు. ముదినేపల్లిలో కూలేందుకు సిద్ధంగా ఉండి పార్టీ నాయకులు తీసేసి పక్కన పెట్టిన ఎన్టీఆర్ విగ్రహానికి కూడా పరదాలు కట్టేశారు. వైసీపీ ఫ్లెక్సీలకు కూడా ముసుగు వేసేశారు. సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు ఉన్న శిలాఫలకాలపై పేపర్లు అంటించారు.



కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు



ముసునూరులో రూం నంబర్లు వెతుక్కుంటున్న దృశ్యం



చాట్రాయి పరీక్ష కేంద్రానికి హడావుడిగా వస్తున్న విద్యార్థినులు



నూజివీడు, ఆగిరిపల్లి కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన టెన్త్ పరీక్షలు
- కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

నూజివీడు టౌన్, మార్చి 18: 10వ తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. తెలుగు పరీక్షకు నూజివీడు డివిజన్ పరిధిలో 17 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3,620మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 3,381 మంది హాజరయ్యారు. ఇందులో 3,349 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 3,262 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 271 మంది హాజరుకావాల్సి ఉండగా, 119 మంది హాజరైనట్టు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. నూజివీడు సెయింట్ థామస్, సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను, సేవ్యా తనిఖీ చేయగా, పట్టణంలోని పరీక్షా కేంద్రాలను నూజివీడు పట్టణ సీఐ మూర్తి పరిశీలించారు.

చాట్రాయి: చాట్రాయిలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో వివిధ గ్రామాల నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను తీసుకువచ్చి జాగ్రత్తలు చెప్పి పరీక్షా కేంద్రాల్లోకి పంపారు. జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో 223 మందికి గాను 205 మంది, ఆర్సీయం సెంటర్‌లో 173 మందికి 153 మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో బ్రహ్మచారి తెలిపా రు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ప్రసాదరెడ్డి, ఆర్సీయం స్కూల్ పరీక్షా కేంద్రానికి శోభారాణి చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

ముసునూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చెక్కపల్లి జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 268 మందికి గాను 242 మంది హాజరు కాగా ముసునూరు జడ్పీ పాఠశాల కేంద్రంలో 210 మందికి గాను 201 మంది, గోపవరం జడ్పీ పాఠశాలలో 187 మందికి గాను 153 మంది హాజరయ్యారు. ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి, తహసీల్దార్ జవహర్ బాజి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య శిబిరం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి, 144 సెక్షన్‌ను అమలు చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ హైస్కూల్లో 223 మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో 178 మంది, ఎస్‌వీ పబ్లిక్ హైస్కూల్లో 218 మంది విద్యార్థులు హాజరు అయ్యారని ఎంఈవో జె.సర్వేశ్వరరావు తెలిపారు. సెంటర్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని ఎస్సై సురేంద్రబాబు తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో...

కైకలూరు, మార్చి 18: కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం మండలంలో 4 సెంటర్లలో పరీక్షలు నిర్వ హించారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్, శ్రీ చైతన్య, మండలంలోని భుజబలపట్నంలోని జడ్పీ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలు గా ఏర్పాటు చేశారు. మొత్తం 818 విద్యార్థులకు గాను 25 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో రామారావు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలైంది.



సమయం అయిపోతోంది మరి..

కలిదిండి: మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరరావుపేట జడ్పీ హైస్కూళ్లతోపాటు కోరుకొల్లు క్రాంతి హైస్కూల్, కలిదిండి శశి హైస్కూ ళ్లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తం 953 మంది విద్యార్థులకు గాను 887 మంది హాజరయ్యారని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు.



ముదినేపల్లి: ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూలు, సహాయ మాతా ప్రైవేట్ హైస్కూలు, పెదగొన్నూరు, కోరుకొల్లు జడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, 8 ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలి రోజు మండలంలోని పరీక్షా కేంద్రాల్లో 678 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 54 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా ముదినేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఇద్దరు మానసిక దివ్యాంగులు పరీక్ష రాశారు. ముదినేపల్లిలోని భవిత కేంద్రంలో మానసిక వికాసానికి శిక్షణ పొందుతూ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న స్తంభం చెరువుకు చెందిన దివ్యాంగుడు రెడ్డి నవదీప్, వడాలికి చెందిన మానసిక దివ్యాంగురాలు పెందుర్తి సునీత పరీక్షలకు హాజరయ్యారు.